www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 18 సెప్టెంబర్ 2023



వినాయక చవితి సందడి



సామగ్రి కొనుగోలు చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-మండపేట

వినాయక చవితి పండగ సందర్భంగా మండపేటలో సందడి నెలకొంది, పూజా సామగ్రి, పాలవెల్లి అలంకరణ సామగ్రి పత్రి, పండ్లు, పూలు విక్రయానికి ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన స్టాల్స్ కొనుగోలు దారులతో స్థానిక కపిలేశ్వరపురం రోడ్డు సందడిగా మారింది. ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన పందిళ్లలో భారీ వినాయకులను ఏర్పాటుచేస్తున్నారు. ప్రతి సంవత్సరం పూజా సామగ్రి ధరలు పెరుగుతున్నప్పటికీ సంవత్సరానికి ఒక సారి వచ్చే ఈ ముఖ్యమైన పండుగకు అత్యంత ప్రాధాన్యత ఇస్తారు.

'ఆక్వా'తో పంటలకు చేటు

- పెరుగుతున్న కాలుష్యం
- తొలకరి పంట పొలాలకు తీవ్ర నష్టం
- ఆందోళన చెందుతున్న రైతులు



అక్రమ ఆక్వా చెరువులను పరిశీలిస్తున్న ఇళ్ల సూర్యనారాయణ



దంగేరు లో రొయ్యల చెరువుల వల్ల పాడైన వరి చేలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

రొయ్యల సాగుతో పంట పొలాలు దెబ్బతింటున్నాయి. వ్యాపారులు రూ.కోట్లు సంపాదించాలనే ఉద్దేశంతో బంగారు పంటలు పండే చేలను ఆక్వా చెరువులుగా మార్చుతున్నారు. ఈ కారణంగా వాతావరణం కాలుష్యం, మంచినీటి కాలుష్యం, పంట పొలాలకు కాలుష్యం ఏర్పడుతోంది. దీనిపై పర్యావరణ శాఖ అధికారులు పలు నిబంధనలను విధించినప్పటికీ అవి ఎక్కడ అమలు జరుగుతున్న దాఖలాలు కనబడటం లేదు. దీంతో రోజురోజుకు చాప కింద నీరులా పంటచేలన్నీ ఆక్వా చెరువులుగా మారిపోతున్నాయి. కె.గంగవరం మండలంలోని కె.గంగవరం దళితవాడ వద్ద, పాతకోట వెంబడి, దంగేరులోనూ, ఎర్రపాతవరంలోనూ, అద్దంపల్లి, వట్రపూడి, భీమకోసు పాలెం, రామచంద్రపురం మండలంలోని ఆక్వా చెరువుల విస్తరణ రోజురోజుకు పెరుగుతోంది. చెరువుల తవ్వకం దారులు చేపల చెరువులకు అనుమతులు తీసుకుని వాటిని అడ్డం పెట్టుకుని రాజకీయ నాయకులు అండ దండలతో చేపల చెరువుల లో రొయ్యలు పెంపకం కొనసాగిస్తున్నారు. రొయ్యలకు వాడే రసాయనాలు, విపరీతమైన మందులు రకరకాల మేత లతో వాతావరణ కాలుష్యం, భూగర్భ జలాల కాలుష్యం ఏర్పడుతోంది. దీంతో పరిసర ప్రాంతాల పంట పొలాలు పూర్తిగా దెబ్బతింటున్నాయి. దీంతో పాటుగా భూగర్భ జలాలు పాడవడంతో అనేక గ్రామాల్లో మంచినీటి సమస్య ఏర్పడుతుంది. ఉప్పునీరు తాగలేని ప్రజలు మంచినీటిని కొనుగోలుకు ఎగబడుతున్నారు. ఆక్వా చెరువుల తవ్వకాల్లో పలు నిబంధనలు పాటించాల్సి ఉన్నప్పటికీ వాటిని ఎవరు బేఖాతరు చేయకపోవడంతో ఈ సమస్య ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాకుండా నిలిచిపోయింది.

ఎండిపోతున్న పంటపొలాలు

అంగ్రంగిలో చెరువుల తవ్వకాన్ని ఆ గ్రామస్తులు పలుమార్లు అడ్డుకున్నప్పటికీ ఫలితం కానరాలేదు. అదేవిధంగా భీమ క్రోసి పాలెం లోను సమస్యపై పలు ఉద్యమాలు జరిగినా అక్కడ సమస్య పరిష్కారం కాలేదు. తాజాగా కె.గంగవరం మండలంలోని దంగేరు గ్రామంలో గల రొయ్యల చెరువుల వల్ల చెరువుల వెంబడి ఉన్న తొలకరిచేలు పూర్తిగా పాడయ్యాయి. గ్రామంలోని రైతులు తొలకరిచేలు పాడవటంపై ఆందోళన చెందుతున్నారు. చెరువుల పరిసర ప్రాంతాల్లోని పంట పొలాలు ఎండిపోయి తెగుళ్లకు గురవుతున్నాయి.

అక్రమ రొయ్యల చెరువులపై ఫిర్యాదు చేస్తా

దీనిపై మండల వ్యవసాయ శాఖ సలహా సంఘం చైర్మన్ ఇళ్ల సూర్యనారాయణ ను వివరణ కోరగా ఆయన నిబంధనలను విరుద్ధంగా పంట పొలాలను రొయ్యల చెరువులు గా మార్చడం వల్ల పలు సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. వాటిలో మంచినీటి సమస్య, వాతావరణ కాలుష్యం, భూగర్భ జలాలు కాలుష్యం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు ఇప్పటికే మండలంలో అనేక పంట పొలాలు రొయ్యల చెరువుగా మారిపోయాయని వీటిని నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పంటలో మంచినీరు పూర్తిగా పాడైతే ప్రజల ఆరోగ్యం, ఆహారం వంటి అనేక సమస్యలు తలెత్తుతాయని వెంటనే అక్రమంగా తవ్విన రొయ్యల చెరువులను పూర్తిగా మూసివేయాలని ఆయన అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జిల్లా అధికారులకు రాష్ట్ర అధికారులకు అక్రమ రొయ్యల చెరువులపై ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన 'ప్రజాశక్తి'కి తెలియజేశారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, పాల్గొన్నసిపిఐ,టిడిపి, ప్రజాసంఘాల నాయకులు

ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్న ప్రభుత్వం

- రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న సిపిఎం, సిపిఐ, టిడిపి, ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి-అమలాపురం

రాష్ట్రంలో ప్రతిపక్షాలు, ప్రజాసంఘాల గొంతునొక్కేలా ప్రభుత్వ వ్యవహరించడం దారుణమని పలుపార్టీలకు చెందిన నాయకులు ధ్వజమెత్తారు. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఆదివారం అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టెబుల్ సమావేశం నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కె. సత్తిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, తెలుగుదేశం మాజీ ఎంఎల్ఏ అయితాబత్తుల ఆనందరావు లు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ఉద్యమాలు, ప్రతిపక్ష పార్టీలపై సాగుతున్న నిర్బంధాన్ని తీవ్రంగా ఖండించారు.రాష్ట్ర ప్రభుత్వం ఒక వైపు ప్రజలపై భారాలు వేస్తూ మరోవైపు ప్రజల నుంచి వస్తున్న అసంతృప్తిని అణిచివేసేందుకు నిర్బంధానికి పూనుకుంటోం దన్నారు. ప్రజా ఉద్యమాలపై ఉక్కుపాదం మోపుతూ ప్రజలు, కష్టజీవులు, కార్మికులు తమ నిరసన తెలియజేయడానికి కూడా అవకాశం లేకుండా చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రదర్శనలకు, ధర్నాలకు అనుమతివ్వడం లేదన్నారు. హాలు మీటింగుకు కూడా అనుమతులు తీసుకోవాలని నిబంధనలు పెడుతోందని అన్నారు. ఈ దుర్మార్గమైన వైఖరిని నాయకులు ఖండించారు. ప్రజాస్వామ్య, పౌర హక్కులను కాలరాసే కేంద్రంలోని బిజెపి బాటలో పయనిస్తున్న రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితుల దీక్షలు జరగకుండా భగ్నం చేసిందని అన్నారు. ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబును అరెస్టు చేసిన తీరును సమావేశం తీవ్రంగా ఖండించింది. ప్రజా ఉద్యమాలపై ప్రభుత్వ నిర్బంధాన్ని ఆపాలని రౌండ్ టెబుల్ సమావేశం పాల్గొన్న సిపిఎం, సిపిఐ, తెలుగుదేశం పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం, సిపిఐ, తెలుగుదేశం పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు జి.దుర్గాప్రసాద్, పాము బాలయ్య, కె.నాగబాబు, యు.నాగరాజు, బి.బలరాం, పోతుల నాగరాజు, వేగిరాజు వెంకటరాజు, కెట రమేష్, మోకా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు రమణ సేవలు చిరస్మరణీయం

ఎంఎల్‌సి ఐవి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఉపాధ్యాయునిగానే కాకుండా సామాజిక సేవలందించిన రమణ చిరస్మరణీయులని ఎంఎల్‌సి ఐ. వెంకటేశ్వరరావు కొనియాడారు. గోపవరానికి చెందిన ఎన్‌వి.రమణ అమలాపురం రూరల్ మండలం కందేరివారి పేట ఎంపిపి పాఠశాల్లో ఉపాధ్యాయునిగా పని చేస్తూ ఇటీవల ఆకస్మికంగా మృతి చెందారు. రమణ సంస్మరణ సభను ఆదివారం గోపవరంలోని ఆయన స్వగృహం వద్ద నిర్వహించారు. రమణ చిత్రపటానికి ఎంఎల్‌సి ఐవి, యుటిఎఫ్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించి రమణ కుటుంబ సభ్యులను ఓదార్చారు. యుటిఎఫ్ కుటుంబ సంక్షేమ పథకం ద్వారా రూ.3 లక్షల చెక్కును రమణ కుటుంబ సభ్యులకు ఎంఎల్‌సి ఐవి అందజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ సంక్షేమ సంఘం కార్యదర్శి విశ్వనాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.చంద్రకళ, జిల్లా కార్యదర్శి పెన్నాడ శ్రీనివాస్, జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం టివి.సుబ్బారావు, మండల శాఖ అధ్యక్షులు వేపకాయల వెంకట సూర్య చంద్రరావు, కార్యదర్శి కె.శ్రీనివాసరావు, నాలం రవికుమార్, యుటిఎఫ్ ఉప్పలగుప్తం మండల శాఖ అధ్యక్షులు గుత్తుల సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి అత్తిలి సురేష్‌కుమార్, యుటిఎఫ్ నాయకులు బిబిఆర్ ప్రసాద్, కె.నవీన్ కుమార్, ధనరాజు తదితరులు పాల్గొన్నారు.



రమణ కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎంఎల్‌సి ఐవి

నేడు స్పందన కార్యక్రమం రద్దు

ప్రజాశక్తి-అమలాపురం

వినాయక చవితి సందర్భంగా ఈనెల 18వ తేదీ సోమవారం రాష్ట్ర ప్రభుత్వం సెలవును ప్రకటించింది. ఈ సందర్భంగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురం కలెక్టరేట్ నందు సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదులు పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహించ డంలేదని జిల్లా కలెక్టర్ కార్యా లయం అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని జిల్లా వ్యాప్తంగా ఉన్న అర్జీదారులు గమనించి సహకరించాలని కలెక్టరేట్ అధికారులు విజ్ఞప్తి చేశారు.

'కొమరగిరిపట్నం'లో మహా సంకల్పయాత్ర

ప్రజాశక్తి-అమలాపురం

అల్లవరం మండలం కొమరగిరిపట్నం గ్రామంలో జనసేన పార్టీ అమలాపురం నియోజకవర్గం ఇంచార్జ్ శెట్టిబత్తుల రాజబాబు ఆధ్వర్యంలో ఆదివారం మహా సంకల్ప యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ జనసేన పార్టీ అధికారంలోకి వస్తే పూర్తిస్థాయిలో రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. గ్రామంలో ప్రధానంగా రైతులకు సాగునీరు సమస్య త్రాగునీటి సమస్య అధికంగా ఉందన్నారు. కొమరగిరిపట్నంలో మూడు ఆర్‌బికెలు నిర్మాణంలో ఉన్నా గాని తొల కరి వరి సాగు ఎందుకు జరగడంలేదన్నారు.జనసేన పార్టీ అధికారంలోకి వస్తే గ్రామంలో సాగునీరు, తాగునీరు ప్రధాన సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసు కుంటామన్నారు. మహాసంకల్పయాత్రకు టిడిపి గ్రామ కమిటీ ఆధ్వర్యంలో సంఘీ భావం తెలిపారు.

అర్హులందరికీ పింఛన్లు : మంత్రి వేణు

ప్రజాశక్తి-రామచంద్రపురం

అర్హులందరికీ పింఛన్లు పంపిణీ చేస్తామని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. కొత్తగా మంజూరైన437 వైఎస్ఆర్ పింఛన్లను ఆయన అందజేశారు. మండల పరిషత్కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేదవానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. సిఎం జగన్ రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి ప్రతి పట్టణానికి ప్రతి గడప..గడపకూ సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేస్తున్నారని మంత్రి అన్నారు ముఖ్యంగా కె.గంగవరం మండలంలోని వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళ, అభయ హస్తం, ఫిషర్ మాన్, డప్పు కళాకారులకు, అర్హులైన వారికి కొత్తగా 437 వైఎస్ఆర్ పింఛన్లను మంజూరు అయ్యాయి. ఇప్పటివరకు కె.గంగవరం మండలంలో కొత్త పెన్షన్లతో కలుపుకుని 10283 మందికి వైఎస్ఆర్ పెన్షన్ కానుక అందిస్తున్నామని, రూ.2,75,14,500 లబ్ధిదారులకి ప్రతినెల పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల కొరకు అనేక సంక్షేమ పథకాలను రూపొందించిందని అర్హత ప్రమాణికంగా ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ ఫలాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు పంపన నాగమణి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ పండుల గోవిందరాజు, గ్రామ సర్పంచులు, జెడ్‌పిటిసి, ఎంపిటిసి సభ్యులు, తహశీల్దార్, ఎంపిడిఒ, వివిధ శాఖల అధికారులు, సచివాలయం సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి వేణు

ఎస్.యనాంలో 'స్వచ్ఛ సాగర్-సురక్షిత సాగర్'

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

స్వచ్ఛ సాగర్ సురక్షిత సాగర్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఎస్.యానాం బీచ్ లో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 350కేజీల ప్లాస్టిక్ ఇతర వ్యర్థాలను తొలగించారు. ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ వాచింగ్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్(ఇంకో ఇస్)శాస్త్రవేత్తలు చెన్నూరి సతీష్, హరీష్‌లు మాట్లాడుతూ ప్రకృతి వనరులను ప్రతి ఒక్క పౌరుడు బాధ్యతాయుతంగా వినియోగించాలని కోరారు.అంతర్జాతీయ తీర పరిశుభ్రత దినోత్సవం ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 3 న ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారని ఈ కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రతకు గణనీయమైన ప్రాధాన్యతనేస్తూ స్వచ్ఛసాగర్ సురక్షిత సాగర్ కార్యక్రమం దేశమంతా నిర్వహించడం జరుగుతోం దన్నారు. ప్రతి ఒక్క పౌరుడు బాధ్యతాయుతంగా ఉండి వ్యర్థాలను ఇష్టానుసారం పడవేయకూడదని అవగాహన కల్పించారు. ఎంఎస్ ఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.త్రిమూర్తులు, జిల్లా అధ్యక్షులు పి.శ్రీనివాసరావు, కార్యదర్శి బొమ్మిడి దుర్గా మల్లేశ్వరరావు, మత్స్యకార సొసైటీ అధ్యక్షులు లంకే చిరంజీవి, లంకే భీమరాజు, హెచ్ఎం అప్పారావు, ఎస్ఐ జి.విలియమ్స్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



ఎస్.యానాం బీచ్ లో సేకరించిన వ్యర్థాలు

చవితి ఉత్సవాల్లో నిబంధనలు పాటించాలి

జిల్లా ఎస్‌పి శ్రీధర్

ప్రజాశక్తి-అమలాపురం

వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మండపాల ఏర్పాట్లలో కమిటీలు నిబంధనలు తప్పకుండా ఆచరించే విధంగా చర్యలు తీసుకోవాలని, చవితి రోజు నుండి నిమజ్జనం వరకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఎస్‌పి ఎస్.శ్రీధర్ ఆదేశించారు. ఆయన విలేకరులతో ఆదివారం మాట్లాడుతూ జిల్లా ప్రజలకు వినాయక చవితి పండగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో పండుగ నిర్వహించుకోవాలని సూచించారు. ఎక్కడైనా ఏవైనా అవాంఛనీయ సంఘటనలు తలెత్తితే వెంటనే సంబంధిత పోలీస్ అధికారులకు లేదా డయల్ 100, 112 లకు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.

ధనమ్మ మర్రికి పర్యాటకుల తాకిడి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

ఇదార్లంక శివారు వీధి వారి లంకలోని ధనమ్మ మర్రి కి ఆదివారం యాత్రికులు, పర్యాటకులు, అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన యాత్రికులు ధనమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. గోదావరి నది తీరం వెంబడి ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ సందడి చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అంగర ఎస్ ఐ బి.చంటి పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించారు.

కొనసాగిన టిడిపి శ్రేణుల దీక్షలు

ప్రజాశక్తి-యంత్రాంగం

టిడిపి అధినేత, మాజీ సిఎం నారా చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌కోనసీమ జిల్లాలో ఆ పార్టీ శ్రేణులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం కొన సాగాయి.

మండపేట చంద్రబాబు అరెస్టుకు నిరసనగా స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద తెలుగు యువత, తెలుగు నాడు స్టూడెంట్స్ ఫెడరేషన్, వాణిజ్య, లీగల్, ధివ్యాంగుల, క్రిష్టియన్స్, సాంకేతిక, డాక్టర్స్, సాంస్కృతిక విభాగాల నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలను ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ ప్రకాష్ లు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అనంతరం వివిధ వర్గాల నుండి సంతకాలు, అభిప్రాయాల సేకరణ కార్యక్రమం చేపట్టారు.వాదా ప్రసాదరావు, యలమంచిలి శ్రీనివాస్, బొల్లి తారకరామారావు, పిల్లా గణపతి, రావు, వీధి ప్రసాద్ రావు తదితరులు పాల్గొన్నారు. ఈ నిరాహారదీక్ష చేపట్టిన నాయకులకు మండపేట పట్టణ, మండల, గ్రామాల నాయకులు అధిక సంఖ్యలో వచ్చి వారికి సంఘీభావం తెలిపారు.

అమలాపురం చంద్రబాబు అక్రమ అరెస్టు ను నిరసిస్తూ టిడిపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు జిల్లా వ్యాప్తంగా రిలే దీక్షలు చేపట్టారు. జిల్లా మహిళా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమలాపురం మెట్ల రమణబాబు ఇంటి వద్ద పలువురు మహిళలు ఈ దీక్షల్లో పాల్గొన్నారు. వీరికి మద్దతు గా అమలాపురం బార్ అసోసియేషన్ కు చెందిన పలువురు న్యాయ వాదులు ఈ దీక్షలో పాల్గొన్నారు. రాష్ట్రం లో తొలి సారిగా న్యాయవాదుల ఈ దీక్షలో పాల్గొన్నారు. వీరిని ఉద్దేశించి నియోజకవర్గం ఇంచార్జ్ అయితాబత్తుల ఆనంద రావు మాట్లాడారు. కార్యక్రమంలో మాకిరెడ్డి ఆదినారాయణ, అడపా ప్రసాద్, గుండాబత్తుల బాల రవితేజ, నందేపు చిన్న వెంకటేశ్వరరావు, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మండపేటలో టిడిపి నాయకుల రిలే నిరాహార దీక్ష




దీక్షా శిబిరంలో అమలాపురం బార్ అసోసియేషన్ సభ్యులు

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్న స్థానికులు

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

అంగర మెయిన్ రహదారి సమీపంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. రహదారి పక్కనే ఉన్న ఈ ట్రాన్స్ ఫార్మర్ చేతికి అందే విధంగా ప్రమాదకరంగా ఉందన్నారు, ఈ ట్రాన్స్ ఫార్మర్ చుట్టూ ఎలాంటి రక్షణ చర్యలు లే కపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని, గ్రామస్తులు ప్రయాణికులు ఆందోళనలు చెందుతున్నారు. ప్రతినిత్యం రద్దీగా ఉండే రహదారి లో ప్రయాణికులు వాహనదారులు ఈ మార్గం ద్వారానే వెళ్లవలసి ఉంది. వర్షాలు కురిసే సమయాల్లో ట్రాన్స్ ఫార్మర్ వద్ద ప్రమాద భరితంగా ఉందని సంబంధిత ట్రాన్స్ కో అధికారులు వెంటనే స్పందించి ట్రాన్స్ ఫార్మర్ కు రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ప్రమాదాలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యగా ట్రాన్స్ ఫార్మర్ చుట్టూ రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు



అంగర రహదారిలో ప్రమాద భరితంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్



వివిధవేషధారణలతో వేడుకల్లో పాల్గొన్నవిద్యార్థులు

నేతాజీ స్కూల్లో చవితి ఉత్సవాలు

ప్రజాశక్తి-ఆలమూరు

చెముడులంక నేతాజీ స్కూల్లో వినాయక చవితి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. సంస్థ కరస్పాండెంట్ యెరుబండి శ్రీనివాస్ మాట్లాడుతూ భారతీయులు జరుపుకునే అతి ముఖ్యమైన పండుగలలో వినాయక చవితి ఒకటన్నారు. వినాయక జన్మ వత్తాంత గాథను విద్యార్థులకు ప్రదర్శించారు. శివుడు, పార్వతి,వినాయకుడు, సుబ్రహ్మణ్య, నందీశ్వరుల వేషధారణలో వారు ప్రదర్శించిన వినాయక జన్మ వత్తాంతం అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **మండపేట** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మండపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షులు విజయ్, ఎపిడబ్ల్యూజెఎఫ్ రామచంద్రపురం డివిజన్ అధ్యక్షులు రెడ్డి ఓమేష్ అన్నారు. కొన్నేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మతి చెందిన రాయవరం మండల విలేకరి రామకృష్ణ జ్ఞాపకార్థం ప్రతి ఏటా ఓమేష్ సౌజన్యంతో నిర్వహించే మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమం మండపేట కలువపువ్వు సెంటర్ లో ఆదివారం జరిగింది. పాత్రికేయులంతా పాల్గొని భక్తులకు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పాత్రికేయులు మోర్త నరేష్, నరాల రమేష్, బొల్లోజు మల్లేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

ప్రజాశక్తి-అమలాపురం

స్థానిక కలెక్టరేట్ నందు విరాట్ విశ్వకర్మ జయంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్ తదితరుల విశ్వకర్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ సమా జానికి అవసరమైన వివిధ వృత్తులను విశ్వకర్మ సష్టించారని ఆమె తెలిపారు. కమ్మరి, వడ్ల, స్వర్ణకార, శిల్ప, కంచరి వంటి వివిధ వత్తులను సష్టించి సమాజానికి అవసరమైన వస్తువులను తయారు చేసుకునేందుకు ఆయన చేసిన సేవల పట్ల విశ్వకర్మ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం హర్ష ణీయమన్నారు. విశ్వకర్మ జయంతిని ప్రతి ఏడాది సెప్టెంబర్ 17న జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు గ్రామీణ ప్రాంతాల్లో సాంప్రదాయ కుల వత్తిదారులు, హస్త కళాకారుల వ్యాపారాన్ని మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకానికి నేడు శ్రీకారం చుట్టిందని జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు తెలిపారు. ఈ పథకంపై గ్రామ, వార్డు సచివాల యాల సిబ్బంది, వాలంటీర్లు, స్వయం సహాయక సంఘాలు, బ్యాంకర్లకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవడంతోపాటు లబ్ధిదారులు ఆన్లైన్లో నమోదుకు చర్యలు తీసుకోవాలన్నారు.

కార్టూన్ 'నిజం'



మెరుగైన సౌకర్యాలు అందించేందుకు కృషి చేయాలి

ప్రజాశక్తి-అమలాపురం

భక్తులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించేలా అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి దేవస్థానం నూతన పాలకవర్గం కృషి చేయాలని ఎంపీ చింతా అనురాధ అన్నారు. అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు ఛైర్మన్‌గా నియమితులైన గుత్తుల నాగబాబు, సభ్యులు ఆదివారం అల్లవరం మండలం మొగళ్లమూరులోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఎంపీ చింతా అనురాధ ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ పాలకవర్గాన్ని సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు.



'అయినవిల్లి' దేవస్థానం నూతన పాలకవర్గాన్ని అభినందిస్తున్న ఎంపీ అనురాధ

నేరాలు ఘోరాలు

పేకాట శిబిరాలపై దాడి పదిమంది అరెస్ట్

ప్రజాశక్తి - రామచంద్రపురం

పామర్రు పోలీస్ స్టేషన్ పరిధిలోని దంగేరు శివారు పంట పొలాల వద్ద పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.10,250 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ జానీ భాష తెలిపారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఇలా చట్ట వ్యతిరేకమైన చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉప్పలగుప్తం ఎన్.కొత్తపల్లి పంచాయతీ రాఘవులపేటలో పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. పేకాడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని రూ.2,900 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జి. వెంకటేశ్వరరావు తెలిపారు.

కల్వర్టును ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గోపాలపురం

ప్రమాదవశాత్తు నేషనల్ హైవేలో ఉన్న కాలువ కల్వర్టును ద్విచక్రవాహనంపై వెళ్తూ ఢీకొట్టిన ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపిన వివరాలు... పోలవరం మండలంలోని ఎల్ఎన్‌డి పేటకు చెందిన కట్టవ సత్యనారాయణ(60) దేవరపల్లి మండలం చిక్కాల గ్రామంలో ఉన్న తన కూతురు ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం 8.30 గంటల సమయంలో తిరిగి తన స్వగ్రామానికి వెళ్లూ గోపాలపురం శివారు పొగాకు బోర్డు సమీపంలో తాడిపూడి కాలువ సంబంధించి నేషనల్ హైవేపై కల్వర్టును ద్విచక్ర వాహనంపై వెళ్లూ ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సత్యనారాయణ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. శవ పంచనామా నిమిత్తం మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రి తరలించినట్లు తెలిపారు.

సిఎం జగన్‌తోనే సంక్షేమం సాధ్యం

ప్రజాశక్తి - గోకవరం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సిఎం జగన్మోహన్ రెడ్డితోనే సంక్షేమ రాజ్యం సాధ్యమని మాజీ మంత్రి తోట నరసింహం అన్నారు. మండలంలోని గాదెలపాలెం గ్రామంలో వైసిపి నాయకులు తుమ్మలపల్లి గంగాధర్, గునిపే ఏడుకొండలు ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. 2024 లో మరొక్కమారు జగన్ని గెలిపించుకోవడానికి మనమందరం సైనికులుగా పనిచేయాలని అన్నారు. తోట రామ్‌జీ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఆత్మీయ సమావేశాలకు ప్రజా స్పందన చూస్తుంటే చాలా ఆనందంగా ఉందన్నారు. దాసరి చినబాబు, అత్తులూరి సాయిబాబా, తోట అయ్యన్న, షేక్ గఫుర్, రామకుర్తి మూర్తి, బదిరెడ్డి సుబ్బయ్యదొర, ఇజ్జిన కిరణ్ కుమార్, కురాకుల సుమంగళి, పత్తి రమేష్ పాల్గొన్నారు.

పాడి రైతుల సంక్షేమానికి కృషి

పశుసంవర్ధక శాఖ జెడి వెంకటరావు





ప్రజాశక్తి - అమలాపురం

జిల్లాలో పశు సంపదను అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, జిల్లాలో పాడి రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని, రైతు భరోసా కేంద్రాల ద్వారా పశు వైద్య సేవల్ని అందిస్తున్నామని అంబేద్కర్ కోనసీమ జిల్లా పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ కె.వెంకటరావు తెలిపారు. పశువులకు బీమా, వ్యాధుల నివారణ, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత, ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను ఆయన వివరించారు.

పాడి రైతుల సంక్షేమానికి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు.

పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం విశేష కృషి చేస్తోంది. ఇప్పటికే గ్రామాల్లోని పశువైద్య సహాయకులను నియమించడంతో వారు రైతులకు పలు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. ఇప్పటివరకూ మూగజీవాలు అనారోగ్యానికి గురైతే రైతులు అందుబాటులో ఉన్న పశు వైద్య సిబ్బందిని సంప్రదించి మందులు వేసేవారు. దీంతో పశువులకు సరైన సమయంలో వైద్యం అందుబాటులోకి వచ్చింది.

పశువుల ఆరోగ్యానికి ఎటువంటి భరోసా కల్పిస్తున్నారు.

పశువుకు సంక్రమించిన వ్యాధి ఏమిటో కచ్చితంగా తెలిసేది కాదు. వ్యాధి నిర్ధారణ ప్రయోగశాల (లేబొరేటరీ) అందుబాటులో లేకపోవడంతో పశువులు చనిపోయి రైతులు నష్టపోయేవారు. లేబరటరీలు ఉంటే పశువులను కాపాడవచ్చని గ్రహించిన సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి పశు వ్యాధి నిర్ధారణ ప్రయోగశాల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. తద్వారా మూగజీవాల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తోంది.

జిల్లా కేంద్రంలో ల్యాబ్ ఎంతవరకు పనిచేస్తుంది..?

జిల్లా కేంద్రంలో రీజినల్ ల్యాబ్ భవన నిర్మాణం పూర్తయింది. త్వరలోనే ఇక్కడ ల్యాబ్ ప్రారంభమవుతుంది. ఇతర పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పశువులు అనారోగ్యానికి గురైతే సమీపంలోని పశు వైద్యశాలల్లో సిబ్బంది వైద్యం చేస్తున్నారు. కింది పశు వైద్యశాలల్లో ప్రయోగశాలలు లేకపోవడంతో పశువులకు ఏ వ్యాధి సోకిందో కచ్చితంగా తెలియడం లేదు. వ్యాధి నిర్ధారణకు జిల్లా కేంద్రంలోని ల్యాబ్‌కు రక్త నమూనాలు పంపిస్తున్నారు. ఆ రిపోర్టులు వచ్చేసరికి వ్యాధి తీవ్రమై పశువులు మరణిస్తున్నాయి. దీంతో పాడి రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి ఒక వెటర్నరీ లేబొరేటరీని అందుబాటులోకి తీసుకువస్తోంది.

ఎన్ని ల్యాబ్ లు అందుబాటులోకి వస్తున్నాయి.

జిల్లాలో 7 నియోజకవర్గాలు ఉండగా జిల్లా కేంద్రంలో రీజినల్ ల్యాబ్ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. అమలాపురం సహా జిల్లాలో 7 నియోజకవర్గాల్లో పశువుల వ్యాధి నిర్ధారణ ప్రయోగశాలలు ఏర్పాటు చేశారు. ఈ ప్రయోగశాలల్లో కూడా పశువులకు సంబంధించిన వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

అన్ని పరీక్షలు ఒకే చోట నిర్వహిస్తారా.

ఈ ప్రయోగశాలల్లో అనారోగ్యానికి గురైన పశువులకు అన్ని రకాల పరీక్షలు చేస్తారు. ఆ ఫలితాలు వెంటనే రావడం వలన సత్వరమే అవసరమైన వైద్యాన్ని అందిస్తారు. ప్రతి నియోజకవర్గ కేంద్రానికి ఒక ల్యాబ్ టెక్నీషియన్, ల్యాబ్ అటెండర్‌ను నియమించారు. ఇప్పటికే ల్యాబ్ టెక్నీషియన్లు పని చేస్తున్నారు. ఈ ల్యాబ్ లకు భవనాలను ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా చేపట్టారు.

పశువధను నిరోధించేందుకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి.

జిల్లాలో పశు విక్రయాలు, పశువుల వధ అంశాలపై ప్రభుత్వం 2014 లో ప్రివెన్షన్ ఆఫ్ క్రూయాలిటీ టు ఏనిమల్ రూల్స్ అనే చట్టాన్ని విడుదల చేసింది. ఈ చట్టం ప్రకారం పశు విక్రయాలను, వధలను నిరోధిస్తారు. 2014 లో అప్పటి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ నీతూ కుమారి హయాంలో కమిటీ ఏర్పడింది. జిల్లా కమిటీకి కలెక్టర్ చైర్మన్‌గా పోలీసు, ట్రాన్స్‌పోర్టు, రెవెన్యూ, పశు సంవర్ధక శాఖ, ఒక ఎన్‌జిఒ, జంతు ప్రేమికులు కమిటీలో సభ్యులుగా ఉంటారు. ఎక్కడైనా పశు వధ జరిగినట్టు సమాచారం వస్తే ఈ కమిటీ చర్యలు తీసుకుంటుంది. నూతనంగా ఏర్పడిన జిల్లా కాబట్టి కమిటీ ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ ఇప్పటికే ప్రతిపాదన పంపారు.

యానాం వార్తలు

రమాబాయి నగర్ అభివృద్ధి కమిటీ ఎంపిక

ప్రజాశక్తి - యానాం

స్థానిక మెట్టకూరు రమాబాయి నగర్ అభివృద్ధి కమిటి ఎంపికైంది. ఈ నూతన కమిటి అధ్యక్షులుగా ఇసుకపట్ల విశ్వనాథం, ఉపాధ్యక్షులుగా బూలా బాలు, సెక్రటరీగా జిల్లెల్ల చిరంజీవి, జాయింట్ సెక్రటరీగా కమిడి కష్ణ ప్రసాద్ దత్తు, కోశాధికారిగా మట్టపర్తి కష్ణ, గ్రామ పెద్దగా బొమ్మిడి శరత్ బాబు, ప్రత్యేక సలహాదారుడుగా యాళ్ల వెంకట్ కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ నూతనంగా ఎంపికైన కమిటీ సభ్యులంతా గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఎన్నికైన వారికి శుభాకాంక్షలు తెలిపారు.

నిబంధనలను అతిక్రమించ వద్దు

ప్రజాశక్తి - పెరవలి

వినాయక చవితి సందర్భంగా పోలీసు శాఖ కొన్ని నిబంధనలను ప్రవేశపెట్టిందని, ఆ నిబంధనలను అతిక్రమించకుండా ఉత్సవ కమిటీలు నడుచుకోవాలని ఎస్ఐ ఎం.సూర్య భగవాన్ సూచించారు. మండలంలోని గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో ఆదివారం ఆయన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ ఉత్సవాల సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో మండపాల వద్ద వినాయక ప్రతిమలు ప్రతిష్టించిన చోట ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా విగ్రహాలను ప్రతిష్టించుకోవాలని తెలిపారు. విద్యుత్ అలంకరణలో జాగ్రత్తలతోపాటు, తీన్మార్ డాన్సులు అతిక్రమించకూడదని అన్నారు. ప్రత్యార్థులపై తారాజువ్వలు వేయటం, ఇతరులను ఇబ్బంది కలగకుండా శబ్ద నియంత్రణ చర్యలను పాటించాలని తెలిపారు. ఊరేగింపు నిమజ్జనం రాత్రి వేళలో చేయరాదని, నిమజ్జన సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, మతపరమైన గొడవలు చేయరాదని సూచించారు.

చోరీ కేసుల్లో ముగ్గురు అరెస్టు

రూ.37.30 లక్షల సొత్తు స్వాధీనం

ప్రజాశక్తి - అమలాపురం

దొంగతనాలు చేయడం. జైలుకు వెళ్లడమే వీరికి నిత్యకృత్యం. వివిధ దొంగతనాలు చేసిన ఒక ముఠాను పి.గన్నవరం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ముఠాకు సంబంధించిన వివరాలను అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పి ఎస్.శ్రీధర్ మీడియా సమావేశంలో వెల్లడించారు. నిందితులు పిల్లి సింహాచలం, ముల్కీ మారుతి శ్రీ సాయి రామ్, వలపశెట్టి వీరబాబు నుంచి రూ.37,30,000 సొత్తు స్వాధీనం చేసుకున్నామన్నారు. 32 కేసుల్లో వీరు నిందితులన్నారు. చెడు వ్యసానాలకు అలవాటు పడి రాత్రి సమయంలో తాళాలు వేసి ఉన్న గృహాల్లో దొంగతనంగా ప్రవేశించి ఇంటి తాళాలు, తలుపు గెడలు బద్దలు కొట్టి బీరువాల్లో ఉన్న వెండి, బంగారం వస్తువులను దొంగిలించి జల్సాలు చేయడం అలవాటుగా చేసుకున్నారని తెలిపారు. పలివెల వంతెన దగ్గరలో మెయిన్ రోడ్డు ప్రక్కన వారు అద్దెకు ఉంటున్న ఇంటి దగ్గర ఈ ముగ్గురిని పి.గన్నవరం సిఐ ప్రశాంత్, ఎస్ఐ హరికోట శాస్త్రి అరెస్ట్ చేశారని తెలిపారు. మొదటి ముద్దాయి పిల్లి సింహాచలంపై తిమ్మాపురం, పెద్దాపురం, పిఠాపురం, పాలకొల్లు, సర్పవరం, కోటవురట్ల పోలీస్ స్టేషన్ ఏరియాల్లో జరిగిన పలు దొంగతనాలపై కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. పలు కేసుల్లో ముద్దాయి అయిన సింహాచలం 2 సంవత్సరాల 8 నెలలు రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో రిమాండు ఖైదీగా ఉండి 2021 జూన్ నెలలో బెయిల్‌పై బయటకు వచ్చాడని వెల్లడించారు. తదనంతరంకోటవురట్ల పోలీసేస్టేషన్ కేసులో కోర్టు 2 సంవత్సరాలు జైలు శిక్ష విధించగా విశాఖపట్నం జైల్ నందు శిక్ష అనుభవించి బయటకి వచ్చాడని ఎస్పి తెలిపారు. రెండో నిందుతుడు ముల్కీ మారుతి శ్రీ సాయి రామ్‌పై కూడా సర్పవరం పోలీస్ స్టేషన్లో మోటార్ సైకిల్ దొంగతనం కేసు ఉందని, వీరు జైలు శిక్ష అనుభవించి ఆయా పరిధిలో రాత్రి తిరిగి వచ్చి మళ్ళీ దొంగతనాలు చేస్తూ ఆ తరువాత విలాసలు చేసే వారన్నారు. ఈ ముగ్గురు నిందుతుల నుంచి నుంచి 592.450 గ్రాముల బంగారం, దాని విలువ రూ. 33,00,000, 4 మోటార్ సైకిళ్ళు, 3 టివిలు, 1 కెమెరా, 1 కెమెరా ఫ్లాష్ లైట్, ఒక హోం థియేటర్, ఒక మ్యూజికల్ గిటార్ మొత్తం విలువ రూ. 4,30,000 ఉంటుందన్నారు. ముగ్గురు నిందుతుల నుంచి స్వాధీనం చేసుకున్న వాటి విలువ మొత్తం విలువ రూ.37,30,000 ఉంటుందని ఎస్పి శ్రీధర్ తెలిపారు. నేరస్తులను చాకచక్యంగా అరెస్టు చేసేందుకు సహకరించిన కొత్తపేట డిఎస్పి కెవి.రమణ, పి. గన్నవరం సిఐ డి.ప్రశాంత్‌కుమార్, గన్నవరం ఎస్ఐ హరికోటి శాస్త్రి, అమలాపురం క్రైమ్ ఇన్‌స్పెక్టర్ గోవిందరావు, అమలాపురం క్రైమ్ ఎస్ఐ సంపత్ కుమార్, ఎఎస్ఐ బాలకృష్ణ, సిబ్బంది శేఖర్ రాజు, నాగేశ్వరావు, శ్రీను, రమణ, ప్రసాద్, కష్ణసాయి, సుభాకర్, అర్జునరావు, ప్రసాద్, హరిబాబు, శ్రీను, సతీష్, చిరంజీవిలను ఎస్పి అభినందించారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు : మంత్రి

ప్రజాశక్తి - చాగల్లు

రాష్ట్రంలో ప్రతీ ఇంటికి ప్రభుత్వ సంక్షేమ పథకం అందుతుందని మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని దారవరంలో ఆదివారం సచివాలయ భవనం, హెల్త్ సెంటర్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవరత్నాల ద్వారా గ్రామంలోని ప్రతి ఇంటికి అమ్మ ఒడి, చేయూత, విద్యాదీవెన, జగనన్న విద్యా కానుక, జగనన్న చేదోడు, వివిధ రకాల పింఛన్లు అందిస్తున్నామని తెలిపారు. ప్రతి గ్రామంలో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి, ప్రతి 50 ఇళ్లకు ఒక వాలంటీర్ ద్వారా ఇంటికి లబ్ధి చేకూరేలా కషి చేస్తుందని అన్నారు. గత ప్రభుత్వం ప్రజలకు ఏమి చేయకపోగా జన్మభూమి కమిటీల పేరుతో ఆఫీసుల చుట్టూ, నాయకుల చుట్టూ ప్రజలను తిప్పుకున్నారని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం ప్రతిపక్షాలన్నీ కలిసి పొత్తు కుదుర్చుకునేందుకు నాన్న తంటాలు పడుతున్నాయని, మళ్లీ ఎన్నికలు వస్తున్న సందర్భంగా గ్రామాల్లోకి మాయమాటలు చెప్పేందుకు నాయకులు వస్తుంటారని తెలిపారు. గత ప్రభుత్వంలో తమ గ్రామాల్లో ఎటువంటి అభివద్ధి పనులు చేశారో ప్రతిపక్ష నాయకులను ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. సిఎం జగన్మోహన్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని తానేటి వనిత కోరారు. ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం సభాప్రాంగణం వద్ద సర్పంచ్ మద్దుకూరి రవిప్రసాద్ జన్మదిన వేడుకల్లో హోంమంత్రి తానేటి వనిత పాల్గొని రవిప్రసాద్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నిత్యం ఆయురారోగ్యాలతో ఆనందంతో ఉండాలని.. ప్రజలకు మరింత సేవలు అందించాలని ఆమె ఆకాంక్షించారు.

పాస్‌పోర్టు పోయినది

కాకినాడ జిల్లా, సామర్లకోట మండలం, సామర్లకోట గ్రామ నివాసి అయిన కోరుకొండ శ్రీనిజ, తండ్రి: కోరుకొండ శేఖర్ అను నేను సామర్లకోటలో ది.11-09-2023వ తేదీన ఇంటికి వెళ్ళుచుండగా మార్గంమధ్యలో నా పాస్‌పోర్టు పోయినది. **నా పాస్‌పోర్టు నెం. R9995661.** కావున ఎవరికైనా నా పాస్‌పోర్టు దొరికిన ఎడల ఈ క్రింది అడ్రసునందు తెలియపర్చగలరు.

కోరుకొండ శ్రీనిజ
తండ్రి: కోరుకొండ శేఖర్,
డో.నెం. 9-1-22/1, బళ్ళ మార్కెట్ సెంటర్,
సామర్లకోట, కాకినాడ జిల్లా - 533440.
సెల్: 99480 36997




అర్తమూరులో దిగిపోయిన సిసి రోడ్డు

అర్తమూరులో ప్రమాదకరంగా సిసి రోడ్లు

ప్రజాశక్తి-మండపేట

అర్తమూరులో సిసి రోడ్లు ప్రమాదాలకు నిలయంగా మారాయి. గ్రామంలోని శ్మశాన వాటిక సమీపంలోని కాలువ వెంబడి ఉన్న సిసి రోడ్డు రెండు చోట్ల దిగిపోవడం, రామచంద్రపురం రోడ్డులోని తుపాకుల తూము వద్ద నుండి గ్రామంలోకి వచ్చే సిసి రోడ్డుకు గోతులు పడడంతో ఈ రోడ్లు ప్రమాదాలకు నిలయంగా మారాయి. దీంతో స్థానికులు, వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మధ్యకు విడిపోవడంతో రాత్రి సమయాల్లో ప్రజలు జారిపడుతున్నారని స్థానికులుచెబుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మత్తులు చేపట్టాలని వారు కోరుతున్నారు.



తాపేశ్వరం రోడ్డులో ఒరిగిన విద్యుత్ స్తంభం

పంట బోదెలోకి ఒరిగిన విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి-మండపేట

మండపేట పట్టణ శివారు తాపేశ్వరం ప్రధాన రోడ్ లోని మెహర్ విద్యానికేతన్ సమీపంలో విద్యుత్ స్తంభం పంటబోదెలోకి ఒరిగిపోయింది. ఈ స్తంభానికి సపోర్ట్ గా వేసిన మరో స్తంభం విరిగిపోవడంతో పాటు పాదులు నిండుగా అలుము కున్నాయి. ఈ నేపథ్యంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా రోడ్డు గోతులమయంగా మారడంతో వాటిని తప్పించే ప్రయత్నంలోనే భారీ వాహనాలు దాటికి విద్యుత్ స్తంభం ఒరిగిపోతుందని పలువురు చెబుతున్నారు.ఇప్పటికైనా సంబంధం అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

డంపింగ్ యార్డులుగా రోడ్లు, కాలువ గట్లు

ప్రజాశక్తి-మండపేట

మండపేట పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛభారత్, స్వచ్ఛ సర్వేక్షణ్, మనం మన పరిశుభ్రత, వ్యర్థాలపై వ్యతిరేకపోరాటంతోపాటు పారిశుధ్యంపై అవగాహన వంటి ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మెరుగుపడటం లేదు. సమస్య నానాటికీ తీవ్ర రూపం దాలుస్తోంది. ఆహ్లాదకంగా ఉండాల్సిన రహదారులు, కాలువ గట్లు డంపింగ్ యార్డులుగామారి దుర్గంధం వెదజల్లుతున్నాయి. దీంతో తాము వ్యాధుల బారిన పడుతున్నామని స్థానికులు, ప్రయాణీకులు వాపోతున్నారు. ఇవి కుక్కలకు, పందులకు, దోమలు.క్రిమికీటకాలకు ఆవాసాలుగా మారుతుండటంతో రాత్రి సమయాల్లో దోమలు కంటి మీదకునుకు లేకుండా చేస్తున్నాయని ప్రజలు చెబుతున్నారు.ప్రభుత్వాలు, పాలకులు,



అర్తమూరు రోడ్డులో కాలువ చెంతనే పేరుకుపోయిన చెత్త

అధికారులు మారుతున్నా సమస్యల పరిష్కారానికి నోచుకోవడంలేదని పలువురు విమర్శిస్తున్నారు. మూతపడ్డ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను తెరిచి, చెత్తను అక్కడికి తరలించాలని కోరుతున్నారు. పచ్చదనం, పరిశుభ్రతను కాపాడే విధంగా అధికారులు సత్వరమే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సూర్యనగర్‌లో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-అమలాపురం

వైసిపి నాయకులు, తుని నియోజ కవర్గ ఎన్నికల పరిశీలకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు 51వ పుట్టినరోజు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆదివారం అమలాపురం సూర్యనగర్‌లో అభిమానులు రక్తదాన శిబిరాన్ని నిర్వహిం చారు. సుమారు 100 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో చెల్లుబోయిన శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ దంగేటి డోలమని రుద్ర, కౌన్సిలర్ డి.రాము, దొంగ చిన్న, కేతా భానుతేజ, రాజులపూడి మురళి, బండారు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న దృశ్యం



పిచ్చి మొక్కలతో ఉన్న పార్క్

పార్కుల్లో కనీస సౌకర్యాలు కరువు

- **30వ వార్డులో పిచ్చి మొక్కలతో నిండిన పార్కు**
- **అభివృద్ధి చేయాలని కోరుతున్న ప్రజలు**

ప్రజాశక్తి-మండపేట

పచ్చదనంతో కళకళలాడుతూ పట్టణ ప్రజలు సేద తీరేందుకు అనువుగా ఉండాల్సిన పార్కులు కనీస సౌకర్యాలు లేక నిరుపయోగంగా మారుతున్నాయి. పట్టణ పరిధిలోని 30వ వార్డులో ఉన్న రాజీవ్ గృహకల్ప కాలనీలో పార్కు పిచ్చి మొక్కలతో చిట్టి అడవిని తలపిస్తోంది. గత కొంతకాలంగా పార్కు ఈ విధంగానే ఉండి నిరుపయోగంగా మారుతుందని కాలనీ ప్రజలు అంటున్నారు.

కనీసం చిన్నారులు ఆడుకునేందుకు ఆట వస్తువులు ఏర్పాటు చేయాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు పార్కు అబివృద్ధికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.